
18 ఏళ్ల నిరీక్షణకు తెర
కుల్కచర్ల మండలం నుంచి ఏడుగురికి కాంట్రాక్టు ఎస్‌జీటీగా అవకాశం లభించింది. 8లో▸


కేంద్రం నిధులతోనే..
పంచాయతీల అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు సమకూరుతాయని బీజేపీ జిల్లా కార్యదర్శి మల్లేశ్ యాదవ్ అన్నారు. 8లో▸


బదిలీల్లో రాజకీయం!
గ్రామాల్లో పని చేస్తున్న ఉద్యోగులపై రాజకీయ నాయకుల వేధింపులు ఎక్కువయ్యాయి. 9లో▸

న్యూస్‌రీల్

మోడల్ స్కూల్ అడ్మిషన్లకు దరఖాస్తులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని జినుగుర్తి గేటు వద్ద ఉన్న తెలంగాణ మోడల్ స్కూల్‌లో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీదేవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో 100 సీట్లు, 7 నుంచి 10వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల కోసం ఆన్‌లైన్‌లో ఈనెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 13న ఎంట్రెన్స్ పరీక్ష ఉంటుందని చెప్పారు. ఓసీలకు రూ.200, ఇతరులకు రూ.125 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు.

గ్రేవ్‌యార్డ్ నిర్మాణానికి నిధులు

హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ


ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో ఏఐఎంఐఎం నాయకులు

బంట్వారం: గ్రేవ్‌యార్డ్ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తానని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని తొర్మామిడికి చెందిన పలువురు మైనార్టీ నాయకులు నగరంలోని ఏఐఎంఐఎం ప్రధాన కార్యాలయంలో హైదరాబాద్ ఎంపీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన ఎంపీ తొర్మామిడిలో గ్రేవ్‌యార్డ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. షెడ్డు నిర్మాణంతో పాటు సీసీ రోడ్డు వేయిస్తానని చెప్పారు. మైనార్టీల అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎంఐఎం మండల అధ్యక్షుడు సయ్యద్ ఖదీర్, మాజీ వార్డు సభ్యుడు మీరసాబ్ ఖదీర్‌పాషా, నాయకులు సమీర్, యూనుస్, ఖాజా, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఈఓ మహేశ్‌కు అభినందనల వెల్లువ

వ్యవసాయ విస్తరణ ఐక్యవేదిక సంఘం సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవం


ఏఈఓ మహేశ్‌ను సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

మర్పల్లి: వ్యవసాయ విస్తరణ ఐక్యవేదిక యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా సిరిపురం క్లస్టర్ ఏఈఓ మహేష్‌ను ఆ సంఘం రాష్ట్ర నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర కార్యవర్గ నాయకులు ఆదివారం ఆయనకు నియామక ఉత్తర్వులు అందజేశారు. అనంతరం మహేశ్‌ను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ.. రాష్ట్ర కార్యవర్గంలో తనకు సముచిత స్థానం కల్పించిన రాష్ట్ర కార్యవర్గానికి, ఆయా జిల్లాల ఏఈఓలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఏఈఓల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు.

వృక్షార్చన విజయవంతం చేయండి

మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న మహేశ్‌రెడ్డి

పరిగి: బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం నిర్వహించనున్న వృక్షార్చన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన పట్టణ కేంద్రంలోని తన నివాసంలో ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా ప్రతీ కార్యకర్త మూడు మొక్కలు నాటాలని సూచించారు. నాటిన మొక్కతో దిగిన సెల్ఫీని 90003 65000 నంబర్‌కు వాట్సాప్ చేయాలని కోరారు. భూగోళాన్ని నివాసయోగ్యంగా మార్చాలనే సంకల్పంతో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అరవింద్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేందర్, సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్‌కు బైబై

ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల్లో జవాబుదారీతనం.. విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం బయోమెట్రిక్ మిషన్లు ఏర్పాటు చేసింది. ఉదయం, సాయంత్రం హాజరును నమోదును ఉన్నతాధికారులు ఆన్‌లైన్‌లో పరిశీలించే వారు. తొలుత పైలెట్ ప్రాజెక్టుగా పది జిల్లాల్లో ప్రవేశపెట్టారు. ఇది విజయవంతమైనప్పటికీ.. చిన్న చిన్న సాంకేతిక కారణాలతో వాటిని వినియోగించడం లేదు.



- చిన్నచిన్న సాకులతో మూలన పడేసిన మిషన్లు
- మూణ్నాళ్ల ముచ్చటగా ఆన్‌లైన్ హాజరు
- పట్టించుకోని విద్యాశాఖ

వికారాబాద్: ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యాశాఖ ప్రభుత్వ పాఠశాలల్లో ఐదేళ్ల క్రితం బయోమెట్రిక్ మిషన్లను ఏర్పాటు చేసింది. వీటిని ఓ ఏడాదిపాటు వినియోగించారు. ఎక్కువ విద్యార్థులున్న పాఠశాలల్లో ఒకింత ఇబ్బంది కలిగినా.. మిగిలిన చోట్ల విజయవంతం అయింది. ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రుల్లో, పెన్షన్ల పంపిణీ, మీసేవా కేంద్రాలు, రేషన్ సరుకుల సరఫరా, గ్రామీణ బ్యాంకుల్లోనూ ఈ విధానం అమలులో ఉంది. విద్యాశాఖ మాత్రం ఈ విధానానికి స్వస్తి పలికింది. దీంతో పారదర్శకత కోసం ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ హాజరు విధానం అభాసుపాలవుతోంది.

సత్ఫలితాలిచ్చినా.. సాకు చూపారు

రోజువారీ హాజరు పర్యవేక్షణకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టిన బయోమెట్రిక్ విధానం మూలన చేరింది. మార్పును ఆశించి ప్రవేశపెట్టిన ఈ విధానం మూన్నాళ్ల ముచ్చటగా మారింది. ఇప్పటికే కళాశాలలు, గురుకుల పాఠశాలలు తదితర సంస్థల్లో బయోమెట్రిక్ విధానం అమలు చేస్తున్న సర్కారు 2018 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో, ఆస్పత్రుల్లో ఈ మిషన్లు ఏర్పాటు చేసింది. పైలెజ్ ప్రాజెక్టుగా తీసుకున్న పదిజిల్లాల్లో వికారాబాద్ ఒకటి. ప్రయోగాత్మక కార్యక్రమం సత్ఫలితాలివ్వడంతో ఆరు నెలల తర్వాత ఇదే విధానం రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేశారు. ఈ విధానం అమలు చేసిన సమయంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతం మెరుగైందని అధికారులు పేర్కొన్నారు. కాగా చిన్న చిన్న కారణాలు సాకుగా చూపుతూ బయోమెట్రిక్ మిషన్లను మూలన పడేశారు. అమలు చేయాల్సిన విద్యాశాఖ ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవవహరిస్తున్నారు.

ప్రతీ ఒక్కరికి వ్యక్తిగత ఐడీలు

జిల్లా వ్యాప్తంగా ఉన్న 1,063 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాశాఖ బయోమెట్రిక్ విధానం అమలు చేసింది. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును బయోమెట్రిక్ విధానం అమలు చేశారు. వారికి వ్యక్తిగత ఐడీలు ఇచ్చారు. ఉదయం, సాయంత్రం హాజరు తీసుకునేలా విధివిధానాలు రూపొందించి అమలు చేశారు. 500 మందికి పైగా విద్యార్థుల సంఖ్య ఉన్న పాఠశాలలు మినహా మిగిలిన పాఠశాలల్లో ఈ విధానం సక్సెస్ అయింది. ఈ విధానం మూలన పడేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. కనీసం ఉపాధ్యాయుల వరకైనా బయోమెట్రిక్ విధానం అమలు చేయాలనే డిమాండ్ వస్తోంది.

ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాలి

పైలెట్ ప్రాజెక్టు కింద అమలు చేసిన పది జిల్లాల్లో ఒకటిగా మన జిల్లాలోనూ బయోమెట్రిక్ ద్వారా ఆన్‌లైన్ హాజరు తీసుకునే ప్రక్రియ విజయవంతంగా అమలు చేశాం. ఈ కార్యక్రమం మంచి ఫలితాలు ఇచ్చింది. మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు విద్యాశాఖ అధికారులు ఎవరైనా రోజువారీగా ఆన్‌లైన్‌లో హాజరు చూసుకునే వీలుండేది. ఈ ఏడాది బయోమెట్రిక్ విధానం అమలు చేయాలని రాష్ట్ర స్థాయి నుంచి విద్యాశాఖ అధికారులు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదు. ఈ విషయంలో ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

– రేణుకాదేవి, డీఈఓ



ఎల్లమ్మ జాతరకు ఏర్పాట్లు షురూ

- మినీ మేడారంగా పేరొందిన పోలేపల్లి
- 20 నుంచి 24 వరకు బ్రహ్మోత్సవాలు
- భారీగా హాజరుకానున్న భక్తజనం
- 21న సిడేకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరు
- అధికారులకు దిశానిర్దేశం చేసిన కలెక్టర్, ఎస్పీ

దుద్యాల్: ధరణిని ఏలే తల్లి.. భక్తుల పాలిట కల్పవల్లి.. పోలేపల్లి ఎల్లమ్మ తల్లి. ఇక్కడ స్వయంబుగా వెలిసిన రేణుకా ఎల్లమ్మ తల్లికి మేడారం తర్వాత అంతటి ఆదరణ ఉన్నది. మండల పరిధిలోని పోలేపల్లిలో ఈ నెల 20 నుంచి 24 వరకు అమ్మవారి జాతర నిర్వహించేందుకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటుగా పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర నుంచి పెద్ద ఎత్తున భక్త జనం తరలిరానున్నారు. వారి సౌకర్యార్థం చేపట్టనున్న ఏర్పాట్లను ఆయల ఈఓ రాజేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ జయరాములు, పాలకవర్గం సభ్యులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి అన్ని శాఖల అధికారులతో సమావేశమై దిశానిర్దేశం చేశారు.

అమ్మవారి చరిత్ర

పూర్వం పోలేపల్లి సమీపంలో ఓ రైతు పొలం దున్నతుండగా తన గడె(నాగలి) లోతుగా వెళ్లడం లేదని ఆ రైతు బరువు పెట్టేందుకు ఓ రాయిని వెతికాడు. తన పొలంలోనే దొరికిన పొడువాటి రాయిని గడెం మీద ఉంచి దున్నాడు. సాయంత్రం నాగలి విడిచి ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు దున్నేందుకు వచ్చిన రైతుకు గడెం మీద కట్టిన రాయి కనిపించకపోవడంతో వెతికాడు. ముందు రోజు దొరికిన దగ్గరే ఆ రాయి పడి ఉండడం చూసి ఆశ్చర్యానికి గురై మళ్లీ గడెంకు కట్టి దున్నాడు. మరుసటి రోజు అదే తంతు కొనసాగింది. దీంతో అర్ధరాత్రి 12 గంటలకు వచ్చి పరిశీలించాడు. ఆ సమయంలో ఆ రాయి తెల్లని వస్త్రాలు ధరించి దేవతలాగా మొదటి స్థానం దగ్గరికి వెళ్లి రాయిగా మారింది. దీంతో రైతు మరుసటి రోజు విషయం గ్రామస్తులకు చెప్పడంతో వారు చూసి ఆశ్చర్యానికి లోనయ్యారు. గ్రామస్తులంతా అక్కడే పూజలు ప్రారంభించారు. చిన్నగా ప్రారంభమైన జాతర నేడు లక్షలాది మంది భక్తులకు ఇలవేల్పుగా మారింది. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారి పోలేపల్లి గ్రామం మీదుగా వెళ్తుండగా స్థానిక ఆంజనేయ ఆలయం వద్ద స్వామివారిని మొక్కుకున్నాడు. ఆయన కోరిక నెరవేరడంతో 50 అడుగుల ఎత్తైన ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేయించాడని గ్రామస్తులు చెబుతున్నారు.

అమ్మవారి సిడే

పోలేపల్లి ఎల్లమ్మ అంటే వందల ఏళ్ల నుంచి ప్రత్యేకత సంతరించుకుంది. జాతరలో ఇక్కడ అమ్మవారి సిడే ప్రత్యేకం. గతంలో జాతర ఉత్సవాల్లో అమ్మవారికి సిడేకు ఒక జోగు మహిళను కట్టి దేవాలయం ప్రదక్షిణ చేయించేవారు. గత పదేళ్లుగా తొట్టెను కట్టి అందులో అమ్మవారి ఉత్సవమూర్తిని ఉంచి ప్రదక్షిణ చేయిస్తున్నారు. సిడే, రథం ఏళ్ల క్రిందటినాటివి కావడంతో శిథిలావస్థకు చేరాయని భావించిన దాతలు రూ.10లక్షలు వెచ్చించి అమ్మవారి సిడే, రూ.14లక్షల విలువ చేసే రథాన్ని ఆలయానికి అందజేశారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాల్లో వీటిని వినియోగిస్తారని ఆలయ ఈఓ రాజేందర్‌రెడ్డి తెలిపారు.


నూతన రథం

సిడేకు ముఖ్యమంత్రి

మిని మేడారంగా పేరు పొందిన పోలేపల్లి ఎల్లమ్మ జాతరకు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి ప్రతీ సంవత్సరం దాదాపుగా రెండు లక్షల వరకు భక్తులు వస్తుంటారు. ఈ ఏడాది 21న సిడే ఉత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విచ్చేసి అమ్మవారిని దర్శించుకోనున్నట్లు సమాచారం. దీంతో భక్తులు మరో 50వేల వరకు పెరిగే అవకాశం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొంటున్నారు.

స్పెషల్ బస్సులు

పోలేపల్లి ఎల్లమ్మ జాతర ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో వస్తుండడంతో టీజీ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయనున్నారు. మహబూబ్‌నగర్ నుంచి కోస్గి మీదుగా, హైదరాబాద్ నుంచి తుంకిమెట్ల మీదుగా, కొడంగల్ నుంచి దుద్యాల్ మీదుగా పోలేపల్లి జాతరకు రోడ్డు మార్గాలు ఉన్నాయి. ప్రైవేట్ వాహనాలలో వచ్చే భక్తులకు దేవస్థాన కమిటీ పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేయిస్తోంది.

జాతర వివరాలు

తేదీ	ఉత్సవం
20	అమ్మవారి పల్లకీసేవ
21	సిడే
22	రథోత్సవం(తేరులాగుట)
23	ప్రత్యేక పూజలు
24	అమ్మవారి ఊరేగింపు


రైతుదీక్ష ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

‘స్థానిక’ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటమి తప్పదు

- ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం
- రైతు దీక్షను విజయవంతం చేయాలి
- మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

ఆమనగల్లు: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. ప్రభుత్వ విధానాలకు నిరసనగా ఈ నెల 18న ఆమనగల్లులో నిర్వహించే రైతుదీక్షకు మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్నారని ఆయన తెలిపారు. పట్టణంలోని జూనియర్ కాలేజీ గ్రౌండ్స్‌లో రైతుదీక్ష వేదిక ఏర్పాట్లను ఆదివారం ఆయన మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, ఆమనగల్లు సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్, తలకొండపల్లి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై స్థానిక నాయకులకు పలు సూచనలు చేశారు. అనంతరం లక్ష్మారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందని ఆరోపించారు. ఎన్నికలకు ముందు అధికారం కోసం ప్రజలకు అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రైతులకు రుణమాఫీ పూర్తిగా జరగలేదని, రైతుభరోసా అందలేదని అన్నారు. మహిళలకు నెలనెలా రూ.2,500 ఇస్తామని చెప్పిన హామీ ఎటు పోయిందని ప్రశ్నించారు. కేటీఆర్ దీక్షకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆమనగల్లు మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ కన్వీనర్ పత్యానాయక్, మాజీ ఎంపీపీ నిర్మల, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నర్సింహ, మాజీ సర్పంచ్‌లు శ్రీనునాయక్, జ్యోతయ్య, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఆమనగల్లు లయన్స్‌క్లబ్‌కు అవార్డుల పంట


అవార్డులు అందుకున్న ఆమనగల్లు లయన్స్‌క్లబ్ సభ్యులు

ఆమనగల్లు: లయన్స్‌క్లబ్ రీజియన్ పరిధిలో చేపట్టిన సేవా కార్యక్రమాల నిర్వహణకు గాను ఆమనగల్లు లయన్స్‌క్లబ్‌కు అవార్డుల పంట పండింది. ఏటా రీజియన్ పరిధిలో అత్యుత్తమ సేవలు అందించే లయన్స్‌క్లబ్‌లకు అవార్డులు అందిస్తారు. ఈ ఏడాది నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని తేజ కన్వెన్షన్ హాలులో ఆదివారం జరిగిన లయన్స్‌క్లబ్ రీజియన్ సమావేశంలో రీజియన్ చైర్మన్ డా.శ్రీను లయన్స్‌క్లబ్‌లకు అవార్డులను అందించారు. 2024–25 సంవత్సరానికి గాను చేపట్టిన సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా మొత్తం వివిధ విభాగాల్లో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ 33 అవార్డులు దక్కించుకుంది. రీజియన్ పరిధిలో ఎక్సలెంట్ క్లబ్‌గా ఆమనగల్లు లయన్స్‌క్లబ్, అత్యుత్తమ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా ఆమనగల్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి, ఉత్తమ కార్యదర్శిగా మహేశ్, ఉత్తమ కోశాధికారిగా నర్సింహ, అత్యుత్తమ పీఆర్‌ఓగా పాష అవార్డులు అందుకున్నారు. అలాగే రక్తదాన శిబిరాలు, మెగా వైద్య శిబిరాలు, మధుమేహ పరీక్షల శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలకు గాను అవార్డులు దక్కాయి. ఆమనగల్లు లయన్స్‌క్లబ్‌కు అవార్డులు రావడానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

సర్కార్ బడి.. జ్ఞాపకాల జడి

- ప్రభుత్వ పాఠశాలలో 50 ఏళ్ల సంబరం
- అంగరంగ వైభవంగా స్వర్ణోత్సవాలు
- సందడి చేసిన అప్పటి విద్యార్థులు
- చేవెళ్ల పాఠశాలలో అ‘పూర్వ’ ఘట్టం

చేవెళ్ల: వారంతా సర్కార్ బడిలో ఓనమాలు దిద్దారు.. అంచలంచెలుగా ఎదిగి జీవితంలో స్థిరపడ్డారు.. 50 ఏళ్ల కాలంలో కలిసి చదువుకున్న వారంతా ఒక్కచోట చేరారు.. జ్ఞాపకాల జడిలో తడిసి ముద్దయ్యారు.. వయసును మరిచి, హోదాలను పక్కన పెట్టి ఆటపాటలతో సందడి చేశారు.. ఈ అ‘పూర్వ’ ఘట్టానికి చేవెళ్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికగా మారింది. ఈ పాఠశాలలో 1955 నుంచి 2005 వరకు 50 ఏళ్ల కాలంలో కలిసి చదువుకున్న వివిధ బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులు ఆదివారం స్వర్ణోత్సవాలను సంబరంగా జరుపుకొన్నారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు.

అప్పటి ఉపాధ్యాయులను ఆహ్వానించి..

వేడుకలకు 1955 నుంచి 1980 వరకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను సాదరంగా ఆహ్వానించారు. వారిని ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థుల్లో ప్రభుత్వ ఉద్యోగాలు చేసి ఉద్యోగ విరమణ చేసిన వారిని సైతం సత్కరించారు. చాలాకాలం తర్వాత అంతా కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఈ వేడుక తమ జీవితంలో ఒక జ్ఞాపకంగా గుర్తుండిపోతుందని పలువురు పూర్వ విద్యార్థులు అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో ఈ పాఠశాల అభివృద్ధికి కలిసి కృషి చేస్తామని ప్రకటించారు. ఆరు నెలలుగా 1981–82 బ్యాచ్ విద్యార్థులు చేసిన కృషితో పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

ఇలాంటి వేడుక ఎప్పుడూ చూడలేదని పూర్వ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఆ నాడు తాము చదువులు చెప్పిన విత్తనాల్లాంటి విద్యార్థులు నేడు మహావృక్షాలుగా ఎదగడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఉత్సాహంగా గడిపారు. పూర్వ విద్యార్థి శ్రీనివాస్‌గౌడ్ తన ఆర్కెస్ట్రా బృందంతో ఆలపించిన పాటలు అలరించాయి. వేడుకకు సహకారం అందించిన దాతలు కృష్ణారెడ్డి, దేవర వెంకట్‌రెడ్డి, ఆగిరెడ్డిని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయలు బుగ్గారెడ్డి, మల్లయ్యగౌడ్, ఖుర్షీద్ అలీ, నర్సింలు, గాంధీ, పద్మ, సులోచన, భానుమతి, నిర్వాహకులు ఆర్.శ్రీనివాస్, బురాన్ ప్రభాకర్, గోపాలచారి, షఫీ, వెంకట్‌రెడ్డి, మాణిక్యం, పెంటయ్య, ఖాజాపాషా, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వేడుకల్లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు


అప్పటి ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

అంతా కలిస్తే బాగుంటుందనే..



చదువుకున్న పాఠశాలను అభివృద్ధి చేయాలని 1981–82 బ్యాచ్ పూర్వ విద్యార్థులం అంతా అనుకున్నాం.. పాఠశాలలో చదివిన అన్ని బ్యాచ్‌ల విద్యార్థులు కలిస్తే బాగుంటుందని, పాఠశాల అభివృద్ధికి మరింత తోడవుతుందని ఆలోచన వచ్చింది. దీనికి 50 ఏళ్ల స్వర్ణోత్సవ వేడుక కూడా కుదిరింది. ఆరు నెలలుగా పూర్వ విద్యార్థులను అందరినీ కలుస్తూ గ్రూప్ క్రియేట్ చేసి ఏకం చేసేందుకు కృషి చేశాం. పూర్వ విద్యార్థులంతా వేడుకలకు హాజరుకావడం.. పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తామని ప్రకటించడం మరింత సంతోషాన్ని నింపింది.

– ఆర్. శ్రీనివాస్‌గుప్తా, పూర్వ విద్యార్థి

ఎప్పుడూ లేని సంతోషం



ఈ వేడుక ఒక పూర్వ విద్యార్థిగా ఎప్పుడూ లేని సంతోషాన్ని కలిగించింది. మనం చదువుకున్న పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలనే ఆలోచనలోంచి వచ్చిందే ఈ స్వర్ణోత్సవ వేడుక. మాకు చదువు చెప్పిన గురువులను మేము గౌరవిస్తుంటే.. మేము చదువు చెప్పిన విద్యార్థులు సైతం ఈ వేడుకల్లో పాల్గొని వారి అనుభవాలను పంచుకున్నారు. ఇది మరిచిపోలేని అనుభూతిని మిగిల్చింది. పాఠశాల ప్రారంభించి 70 ఏళ్లు అవుతోంది. అప్పటి నుంచి చదువుకున్న విద్యార్థులు వేడుకలకు హాజరు కావడం బాగుంది.

– బురాన్ ప్రభాకర్, 1982–83 బ్యాచ్ విద్యార్థి

యువతకు స్ఫూర్తినిచ్చేలా..



పూర్వ విద్యార్థుల సమ్మేళనం యువతకు స్ఫూర్తినిచ్చేలా ఉంది. ఈ పాఠశాలలో చదివిన మాకు ఇన్నేళ్ల చరిత్ర, ఇంత మంది ఉన్నారనే విషయం ఇక్కడ కలిసే వరకు తెలియదు. 50ఏళ్ల నాటి పూర్వ విద్యార్థులను ఒకచోట కలిసేలా ఏకం చేసిన నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు. పాఠశాల అభివృద్ధికి అంతా కలిసి కృషి చేయాలనే ఆలోచన అద్భుతం. మాకు పాఠాలు చెప్పిన గురువులు, వారి గురువులను గౌరవించే వేడుకలో పాల్గొనం ఎంతో సంతోషంగా ఉంది. భవిష్యత్ తరానికి ఆదర్శంగా నిలిచేలా ఈ వేడుక మిగులుతుంది.

– ఎ.అనంత్‌రెడ్డి, 2002–03 బ్యాచ్ విద్యార్థి

క్లుప్తంగా

మార్కెట్ ఆదాయం రూ.83.81లక్షలు

ధారూరు: ధారూరు వ్యవసాయ మార్కెట్ పరిధిలోని నాగసమందర్ గ్రామంలో ఏర్పాటైన శ్రీసాయిబాబా ఆగ్రో కాటన్‌మిల్‌కు రూ.83.81 లక్షల ఆదాయం వచ్చిందని మార్కెట్ కార్యదర్శి సిద్దమ్మ ఆదివారం తెలిపారు. 2024–25 సంవత్సరంలో నవంబర్ 4 నుంచి జనవరి 31 వరకు 5,501 మంది 1,12,892 క్వింటాళ్ల పత్తిని విక్రయించారు. మార్కెట్‌కు రావాల్సిన ఒక శాతం డబ్బు కింద రూ.83.81 లక్షల ఆదాయం సమకూరిందని ఆమె వివరించారు. ధారూరు వ్యవసాయ మార్కెట్‌కు ఈ సారి రూ.15 లక్షల వరకు ఆదాయం సమకూరిందని చెప్పారు.

విద్యాభివృద్ధికి కృషి చేయండి



ఎంఈఓ రమేశ్‌ను సన్మానిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

యాలాల: మండల వ్యాప్తంగా ప్రణాళికతో విద్యాభివృద్ధికి పాటుపడాలని కాంగ్రెస్ సీనియర్ నేత, ఆర్‌బీఎల్ ఫ్యాక్టరీ ఎండీ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి కోరారు. నూతన ఎంఈఓగా నియామకమైన రమేశ్‌ను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం, పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన, వసతుల కల్పనకు ముందుకు సాగాలని ఆయనకు సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పీఆర్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణారెడ్డి, రాములు, జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి, జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌చారి, విజయ్‌కుమార్, మురహరినాథ్, లక్ష్మయ్య ఉన్నారు.

రాజశేఖర్‌రెడ్డికి వివేకానంద ఐకాన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న రాజశేఖర్‌రెడ్డి

అనంతగిరి: విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ సామాజిక సేవాల విభాగంలో శారదా ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ కొప్పుల రాజశేఖరరెడ్డికి స్వామి వివేకానంద ఐకాన్ అవార్డు–2025 అందజేసింది. శనివారం రాత్రి హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు ఈ అవార్డు అందజేశారు. వైద్యసేవలతో ప్రజలకు అండగా నిలుస్తున్న డాక్టర్ రాజశేఖర్‌రెడ్డిని పలువురు అభినందించారు.

కేసీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



కేసీఆర్‌తో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను ఆదివారం పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 17న కేసీఆర్ జన్మదినం సందర్భంగా ముందస్తుగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నిండు నూరేళ్ల సుఖసంతోషాలతో ఉండాలని కోరారన్నారు. అనంతరం కేసీఆర్ నియోజకవర్గ స్థితిగతులపై ఆరా తీశారన్నారు. నిరంతరం ప్రజల్లో ఉండి ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని సూచించినట్లు చెప్పారు.

18 ఏళ్ల నిరీక్షణకు తెర

- 2008 డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలు
- మండలంలో ఏడుగురికి ఉపాధ్యాయులుగా అవకాశం
- హర్షం వ్యక్తం చేస్తున్న డీఎస్సీ అభ్యర్థులు



డీఈఓ గోవిందరాజు చేతులమీదుగా అపాయింట్‌మెంట్ ఆర్డర్ స్వీకరిస్తున్న మణిమాల

కుల్కచర్ల: ఉపాధ్యాయ ఉద్యోగాన్ని సాధించడం అనేది ఆషామాషీ విషయమేమి కాదు. సంవత్సరాల తరబడి చదువుతూ ఎన్నో నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తుంది. అయినప్పటికీ అదృష్టం వరిస్తుందో లేదో తెలియని పరిస్థితి. 'బతకలేక బడి పంతులు అనేది నాటి నానుడి నేడు జీవనానికి బడి పంతులు ఉద్యోగమే ఉత్తమం' అలాంటి ఉద్యోగం వచ్చిందని తెలిసి.. మళ్లి పోస్టింగ్ ఆగిపోయిందని పడిన ఆవేదన అంతో ఇంతో కాదు. ఇక రాదనుకున్న ఆ ఉద్యోగాన్ని సాధించడం కోసం ఏకంగా 18ఏళ్లు నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. 2008లో డీఎస్సీ అర్హత పరీక్ష నిర్వహించారు. 2010లోనే ఫలితాలు వచ్చాయి. కానీ ఈ ప్రక్రియలో డీఈడీ అభ్యర్థులకు అదనంగా అవకాశం కల్పించడంతో కొందరికి అప్పుడు ఉద్యోగాలు ఇవ్వలేదు. నాటి నుంచి కోర్టు ద్వారా పోరాటం చేస్తూనే ఉన్నాం. అందులో భాగంగా గత ఏడాది డిసెంబర్‌లో వీరికి అనుకూలంగా తీర్పు రావడంతో వారు ఉద్యోగాలు పొందేందుకు అవకాశం ఏర్పడింది.

ఉమ్మడి కుల్కచర్లలో ఏడుగురికి..

2008 డీఎస్సీలో భాగంగా నాడు ఉద్యోగ అవకాశం నిలిచిపోయిన వారికి ప్రస్తుతం కాంట్రాక్టు పద్ధతిలో ఎస్‌జీటీగా అవకాశం ఇచ్చారు. ఉమ్మడి కులకచర్లలో ఏడుగురికి ఉద్యోగ అవకాశం లభించింది. చెల్లాపూర్ గ్రామానికి చెందిన కృష్ణ, కుల్కచర్లకు చెందిన మణిమాల, ముజాహిద్‌పూర్‌కు చెందిన శివకుమార్, మరికల్ గ్రామానికి చెందిన కాళికర్ నగేశ్, కాళికర్ రాధిక, నీలి శ్రీనివాస్, కేసీరెడ్డి కల్పలతలు ఎంపికయ్యారు.

ఒకే ఇంటి నుంచి ఇద్దరికి...





మండల పరిధిలోని మరికల్ గ్రామానికి చెందిన నర్సింగ్‌రావు పద్మావతమ్మ దంపతుల కుమారుడు, కూతురు నగేష్, రాధికలు. వీరు 2008 డీఎస్సీలో ఉపాధ్యాయ ప్రవేశ పరీక్ష రాశారు. ఫలితాల అనంతరం వీరిరువురికి ఉద్యోగాలను పెండింగ్‌లో పెట్టారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం వీరికి ఉద్యోగాలు కల్పించడంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమ పోరాటంతో తమకు కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగాలు వచ్చినందుకు ఆనందంగా ఉందని చెబుతున్నారు.

– నగేష్, రాధిక, మరికల్

కష్టానికి తగ్గ ప్రతిఫలం



ఉపాధ్యాయ ఉద్యోగాన్ని పొందాలన్న నా ప్రయత్నం విజయవంతం అయ్యింది. 2010లో ఫలితాలు వెలువడగా నాకు ఉద్యోగం వస్తుందన్న నమ్మకంతో ఉన్నాను. ఇప్పటికి నా కష్టానికి తగిన ప్రతిఫలం లభించినట్లయింది. ఉపాధ్యాయ వృత్తిపై ఆసక్తితో 13సంవత్సరాలుగా విద్యా రంగంలోనే సీఆర్పీగా విధులు నిర్వహిస్తున్నాను. – కృష్ణ, చెల్లాపూర్ గ్రామం, కుల్కచర్ల మండలం

సంతోషంగా ఉంది



16 సంవత్సరాల ఎదుచూపులకు ఎట్టకేలకు ఫలితం దక్కింది. ఉపాధ్యాయ ఉద్యోగాన్ని పొందడం కోసం ఎంతో శ్రమించా. నాడు ఫలితం నిరాశ పరచినా, బాధించినా నేడు ఆ బాధ తొలగిపోయింది. ఉపాధ్యాయ వృత్తిపై మక్కువతో నాటి నుంచి నేటి వరకు వివిధ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూనే ఉన్నాను. – మణిమాల, కుల్కచర్ల

కేంద్ర నిధులతోనే పంచాయతీల అభివృద్ధి

బీజేపీ జిల్లా కార్యదర్శి మల్లేశ్ యాదవ్



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మల్లేశ్ యాదవ్ తదితరులు

మర్పల్లి: గ్రామ పంచాయతీల్లో చేపట్టే ప్రతీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు సమకూరుతాయని బీజేపీ జిల్లా కార్యదర్శి బన్నె మల్లేశ్ యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని కల్‌ఖోడలో రూ.5లక్షల ఎంపీ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. పంచాయతీ కార్మికులకు సైతం స్వచ్ఛ భారత్ పథకంలో ప్రతీ నెల వేతనాలు అందజేస్తుందని వివరించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బీజేపీకే మద్దతు తెలుపాలని ఆయన ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు గ్రామస్తులు ఉన్నారు.

అంగరంగ వైభవంగా జాతర



ఆలయ ఆవరణలో పెరుగు బసంతం



అమ్మవారికి పల్లకీ సేవ

కొడంగల్ రూరల్: పట్టణశివారులోని బండల ఎల్లమ్మ జాతర ఉత్సవాలు మూడో రోజు ఆదివారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆదివారం సాయంత్రం అమ్మవారి ఆలయ ఆవరణలో పెరుగు బసంతం నిర్వహించారు. ఆలయం చుట్టూ పల్లకీ సేవ నిర్వహించి అమ్మవారిని ఊరేగించారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుంటూ తమను చల్లంగ చూడాలంటూ వేడుకున్నారన్నారు.



ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చేస్తున్న యువజంటలు

ఎండలకు తగ్గుతున్న పర్యాటకుల రాక

ధారూరు: ధారూరు మడలంలోని కోట్‌పల్లి ప్రాజెక్టుకు ఎండలకు పర్యాటకులు తాకిడి తగ్గిందని పలువురు చెబుతున్నారు. ఆదివారం సెలవు దినం అయినప్పటికీ పర్యాటకుల సందడి లేక వెలవెలబోయింది. వచ్చిన కొందరు ఎక్కడ తిరగకుండా కేవలం బోటింగ్ చేసి సేదతీరి వెళ్లిపోవడం కన్పించింది. వచ్చిన పర్యాటకులంతా ఫొటోలు, సెల్ఫీలు దిగడానికి ఎక్కువ ప్రాధాన్యాత ఇచ్చారు.

రెండు బైకులు ఢీ

ఇద్దరికి గాయాలు

- ఆస్పత్రికి తరలింపు

కుల్కచర్ల: ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీ కొని ఇద్దరికి గాయాలైన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మక్తవెంకటాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మణ్ కుల్కచర్ల నుంచి మక్తవెంకటాపూర్‌కు వెల్తుండగా గాలిగూడెం గ్రామానికి చెందిన మరోవ్యక్తి చౌడాపూర్ నుంచి గాలిగూడెం వైపు వెల్తున్నక్రమంలో చౌడాపూర్ శివారులో ఎదురెదురుగా వెళ్లి ఢీ కొన్నారు. ఈ ఘటనలో గాలిగూడెం గ్రామానికి చెందిన వ్యక్తి తలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో తెలిసిన వ్యక్తులు కారులో ఎక్కించుకుని ఆస్పత్రికి తీసుకువెళ్లారు. మరో వ్యక్తి మక్తవెంకటాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మణ్‌కు కాలికి గాయాలవ్వడంతో 108లో ఆస్పత్రికి తరలించారు.



తలకు గాయమైన సత్తయ్య



కాలుకి గాయంతో లక్ష్మణ్

5.5 కిలోల గంజాయి పట్టివేత

ఉప్పల్: గంజాయి విక్రయిస్తున్న యువకుడిని అదుపులోకి తీసుకున్న ఘటన ఉప్పల్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఓం కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో అల్వాల్, వెంకటాపురానికి చెందిన అభిషేక్ కుమార్ సింగ్ గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎక్సైజ్ పోలీసులు దాడి చేశారు. నిందితుడిని అదుపులలోకి తీసుకుని అతడి నుంచి 5.5 కేజీల గంజాయితో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

పూడూరు: మండల పరిధిలో అభివృద్ధి పనులను ప్రారంభించేందకు పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి విచ్చేయనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్ తెలిపారు. ఉదయం 11 గంటలకు మండల కేంద్రంలో రైతులకు స్ప్రింక్‌లర్ల పంపిణీ, 12 గంటలకు అంగడిచిట్టంపల్లిలో డీసీఎంఎస్ గోదాం ప్రారంభోత్సవం, మధ్యాహ్నం ఒంటి గంటకు మీర్జాపూర్, ఎన్కేపల్లి గ్రామాల్లో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన, మధ్యాహ్నం 2 గంటలకు మన్నెగూడ, పెద్ద ఉమ్మెంతాల్ గ్రామాల్లో డీసీఎంఎస్ గోదాంలను ప్రారంభిస్తారని చెప్పారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



ముస్తాబైన హనుమాన్ ఆలయం

పూడూరు: మండల పరిధిలోని సోమన్‌గుర్తిలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయంలో ఈ నెల 17 నుంచి 19 వరకు విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ఆర్టీసీ బస్సులో నగదు చోరీ

వెంగళరావునగర్ : ఆర్టీసీ బస్సులో నగదు చోరీకి గురైన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చింతల్ ప్రాంతానికి చెందిన పి.అరుణ, శివప్రసాద్ దంపతులు శనివారం ప్లాట్ కొనుగోలు చేసేందుకు నగదు తీసుకుని ఆర్టీసీ అమీర్‌పేటకు బస్సులో వచ్చారు. అమీర్‌పేటలోని రియల్ ఎస్టేట్ కార్యాలయం వద్ద బ్యాగ్‌లో చూసుకోగా అందులో ఉన్న రూ.1.40 లక్షలు నగదు కనిపించలేదు. దీంతో బస్సులో నగదు చోరీకి గురైనట్లుగా భావించినా వారు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అబాకస్‌లో అత్యుత్తమ ప్రతిభ



రవీంద్రభారతిలో విద్యార్థులకు బహుమతి ప్రదానం చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

కుల్కచర్ల: గ్లోబల్ లెవల్ అబాకస్ కాంపిటీషన్ పోటీల్లో మండల విద్యార్థులు ప్రతిభను చాటారు. ఆదివారం నగరంలోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెందిన 53 మంది విద్యార్థులకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, విద్యాశాఖ కమిషనర్ వెంకటనర్సింహారెడ్డి, ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ రాధారెడ్డి అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ దేవిక, డైరెక్టర్ సౌమ్యారెడ్డి, ప్రిన్సిపాల్ అర్చన, కరస్పాండెంట్ విజయకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

లైలా సినిమాలో తాండూరు యువకుడు



కమేడియన్ హన్మంత్‌ను అభినందిస్తున్న మిత్రులు (వృత్తంలో హన్మంత్)

తాండూరు టౌన్: ఇటీవల విడుదలైన హీరో విశ్వక్ సేన్ నటించిన లైలా సినిమాలో తాండూరు పట్టణానికి చెందిన యువకుడు నటించాడు. పాత తాండూరుకు చెందిన హన్మంత్ కొన్నేళ్లుగా సినిమాలో కమేడియన్‌గా నటిస్తున్నాడు. తాజాగా లైలా సినిమాలో అవకాశం వచ్చింది. ఆదివారం తాండూరు పట్టణంలోని శాంతు మహల్ థియేటర్లో మిత్రులతో కలిసి కమేడియన్ హన్మంతు సినిమా చూశాడు. ఈ సందర్భంగా హన్మంత్ నటనకు మిత్రులు తాండూరు పట్టణ వాసులు అభినందించారు. భవిష్యత్‌లో మంచి కమేడియన్‌గా రాణించాలని తాండూరుకు మంచి పేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తంచేశారు.

స్నేహితుడి ఇంటికి స్పీకర్

తల్లి మరణించడంతో పరామర్శ



శేఖర్‌గౌడ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

తాండూరు రూరల్: తాండూరు మండలం చెంగోల్ గ్రామానికి చెందిన శేఖర్‌గౌడ్‌తల్లి రాజమ్మగౌడ్ మృతి చెందింది. ఆదివారం దశదినకర్మ సందర్భంగా శేఖర్‌గౌడ్ బాల్యమిత్రుడు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చెంగోల్ గ్రామానికి వెళ్లి స్నేహితుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు మల్లీశ్వరిగౌడ్, నాయకులు నర్సిములు గౌడ్, వేణుగౌడ్, రాకేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రోడ్లు నిర్మించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య

మంచాల: గ్రామాల్లో బీటీ రోడ్లు నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని చెన్నారెడ్డిగూడలో పార్టీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ.. గతంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి 15 ఏళ్ల అధికారంలో ఉండి చెన్నారెడ్డిగూడ, బండలేమూరు, అజ్జినతండా గ్రామల్లో సీపీఎం బలంగా ఉందని వివక్ష చూపి రోడ్డు నిర్మించకుండా కాలం వెళ్లదీశారని ఆరోపించారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఈ గ్రామాలకు రోడ్డు నిర్మిస్తున్నామని చెప్పి చెన్నారెడ్డిగూడలో శిలాఫలకం వేసి దాదాపు సంవత్సరం అవుతున్నా ఇప్పటికీ చలనం లేదన్నారు. ఈ గ్రామాల్లో రోడ్లు అస్తవ్యస్తంగా మారాయన్నారు. ప్రభుత్వానికి కనీసం ఎన్నికల హామీలను అమలు చేసే పరిస్థితి లేదన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో చెన్నారెడ్డిగూడ, బండలేమూరు, అజ్జినతండా గ్రామాలను ఏకం చేసి పోరు చేస్తామన్నారు. నూతన రోడ్డు సాధించేవరకు అధికారులు, నాయకులను నిలదీస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి వర్గసభ్యుడు స్వామి, నాయకులు పాండు, చంద్రయ్య, మోతీలాల్, సురేష్, వెంకటేష్, ప్రహ్లాద్, కృష్ణ, ప్రవీణ్, జంగయ్య, పరమేశ్, భిక్షపతి, ఇబ్రహీం, ,లచ్చిరాం, ప్రభాకర్ పాల్గొన్నారు.



పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు



దర్గాకు పూలు, చాదర్ తీసుకొస్తున్న కాంగ్రెస్ నేత దేప భాస్కర్‌రెడ్డి



పాల్గొన్న భక్తులు

ఘనంగా సందల్ ఊరేగింపు

పహాడీషరీఫ్ దర్గా వద్ద వేలాది భక్తజనం

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్ బాబా షర్ఫుద్దీన్ దర్గా సందల్ ఊరేగింపు ఆదివారం ఉదయం వైభవంగా కొనసాగింది. 759వ ఉర్సు ఉత్సవాలలో భాగంగా బాలాపూర్‌లో బాబా అడుగిడిన నివాసం నుంచి శనివారం అర్ధరాత్రి ప్రత్యేక ప్రార్థనలనంతరం సందల్ ఊరేగింపు ప్రారంభమయ్యింది. కొత్తపేట, వెంకటాపూర్, షాహీన్‌నగర్, జల్‌పల్లి కమాన్‌ల మీదుగా ఉదయం 9 గంటలకు పహాడీషరీఫ్ దర్గాకు చేరుకుంది. అనంతరం గంధంను కొండపై ఉన్న షర్ఫుద్దీన్ బాబా సమాధిపై ఉంచి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. వేలాది మంది పాల్గొంటున్న ఊరేగింపు కావడంతో పహాడీషరీఫ్, బాలాపూర్ పోలీసులు అదనపు బలగాలతో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. మహేశ్వరం డీసీపీ సునితా రెడ్డి, ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి, పహాడీషరీఫ్, బాలాపూర్‌ల ఇన్‌స్పెక్టర్లు గురువారెడ్డి, సుధాకర్‌లు బందోబస్తును పర్యవేక్షించారు. ఎమ్మెల్సీ రహ్మత్ బేగ్ పాల్గొని ప్రార్థనలు చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి తలపై పూలు, ఛాదర్‌తో వెళ్లి సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు యూసుఫ్ ఖాద్రీ, కొండల్‌యాదవ్, యాదగిరి, దస్తగిర్, అబ్దుల్లాబిన్ అవద్, శ్రీధర్, రవి కుమార్ పాల్గొన్నారు.



గుర్రంతో విన్యాసాలు